

నేరేడుచర్ల మండలం చిల్లేపల్లిలో నాటు వేసిన వరి(ఫైల్)

# పంట దిగుబడిలో మొలక శాతం కీలకం

## నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి

గుర్తింపు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి

రైతులకు అధికారుల సూచనలు, సలహాలు

**యాసంగి పంటకు రైతులు బోర్లు, బావుల కింద వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. రైతులు ఎక్కువగా 1010, 1001, హెచ్ఎంటీ, జైశ్రీరాం, చింట్లు, ఆర్ఎన్ఆర్ఎల్ రకాల్లో ఏదో ఒకటి సాగు చేస్తుంటారు. నారుమళ్లు వేసుకునే సమయంలో రైతులు విత్తనాల ఎంపికకు అధిక ప్రాధాన్యమివ్వాలి. విత్తనం ఎంపికపైనే పంట దిగుబడి ఆధాపడి ఉంటుంది. నాణ్యమైన విత్తన రకాలు, వాటి వివరాలపై ప్రత్యేక కథనం.**

– నేరేడుచర్ల, డిసెంబర్ 7

### విత్తనాలు నాలుగు రకాలు

నాణ్యమైన విత్తనాలు ముఖ్యంగా నాలుగు రకాల్లో లభ్యమవుతాయి. బ్రీడర్, ఫౌండేషన్, సర్టిఫైడ్, ట్రూత్ ఫుల్ లేబుల్స్‌లో విత్తనాలు లభ్యమవుతాయి.

### ఫౌండేషన్ విత్తనం

ఈ విత్తనాన్ని బ్రీడర్ విత్తనం నుంచి ఉత్పత్తి చేస్తారు. వివిధ విత్తనోత్పత్తి సంస్థలు, సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో పండిస్తారు. దాదాపు 100 శాతం జన్యు నాణ్యత కలిగి ఉంటుంది. ప్రైవేట్ విత్తన కంపెనీలు వ్యవసాయ పరిశోధనా కేంద్రాల నుంచి బ్రీడర్ విత్తనాలు తీసుకెళ్లి ఫౌండేషన్ విత్తనాన్ని తయారు చేస్తాయి. ఈ సీడ్‌కు తెలుపు రంగు ట్యాగ్ వేస్తారు.

### బ్రీడర్ విత్తనం

ఇది అన్ని రకాల విత్తనాలకు మూల విత్తనం. దీన్ని కంపెనీలు ఆయా బ్రీడర్ల పరవ్యేక్షణలో పండిస్తారు. వ్యవసాయ పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు రూపొందించేవి ఇటువంటి విత్తనాలే. ఈ విత్తనం 100 శాతం జన్యు నాణ్యత కలిగి ఉంటుంది. బ్రీడర్ సీడ్‌కు బంగారు రంగు ట్యాగ్ వేస్తారు. సీడ్ ధర చాలా ఎక్కువ. రైతులకు రెండు కిలోలకు మించి బ్రీడర్ సీడ్ ఇవ్వరు.

### సర్టిఫైడ్ విత్తనాలు

విత్తనం నుంచి నేరుగా సర్టిఫైడ్(ధ్రువీకరించిన) విత్తనాలను ఉత్పత్తి చేస్తారు. వివిధ సంస్థలు, రైతుల పొలాల్లో కూడా విత్తన పర్యవేక్షకుల సమక్షంలో పండించే అవకాశం ఉంది. ఈ విత్తనానికి నీలిరంగు ట్యాగ్ వేస్తారు.

### ట్రూత్‌ఫుల్ లేబుల్ ..

సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి చేసిన ఈ విత్తనాన్ని విత్తన ధ్రువీకరణ సంస్థ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈ విత్తనాలను ట్రూత్‌ఫుల్ లేబుల్ కింద రైతులకు విక్రయిస్తుంటారు. ట్రూత్‌ఫుల్ లేబుల్ విత్తనానికి ఆకు పచ్చ రంగు ట్యాగ్ వేస్తారు. లేబుల్ ట్యాగ్‌పై విత్తన పరీక్ష చేసిన తేదీ ఉంటుంది. ఆ తేదీ నుంచి తొమ్మిది నెలల కాలపరిమితి లోపు విత్తనాన్ని కొనుగోలు చేయవచ్చు.

### రైతులు ఈ సూచనలు పాటించాలి

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లుపై నంబర్, విత్తన రకం, గడువు తేదీ, డీలరు సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
- గడువు దాటిన విత్తనాలను కొనుగోలు చేయకూడదు.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్‌పై సీల్ ఉందో లేదో చెక్ చేసుకోవాలి.
- కొన్న విత్తనాలను డీలరు వద్దే తూకం వేయించుకోవాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.
- కొనుగోలు చేసిన విత్తన బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలి.
- అరువు పద్ధతిలో విత్తనాలు కొనుగోలు చేసినా సరే బిల్లు తీసుకోవాలి.
- విత్తనాలు కొన్న వెంటనే మొలకశాతం చూసుకోవాలి. మొలక శాతం బాగా ఉండే విత్తనాలనే వాడాలి.

### నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి

వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. దళారుల మాటలు నమ్మకుండా వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. లూజుగా ఉన్న సంచులు, గడువు దాటిన విత్తనాలను కొనుగోలు చేయరాదు. అధికారుల సలహాలు, సూచనలు పాటించి వరి సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చు.



–షేక్ జావిద్, ఏఓ, నేరేడుచర్ల

# చలి గాలికి జర భద్రం



## తుఫాన్‌తో ఒక్కసారిగా మారిన వాతావరణం



**పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు**

**పగటి ఉష్ణోగ్రతలు 16 డిగ్రీలు నమోదు**

**అప్రమత్తంగా లేకుంటే వ్యాధులు ప్రబలే అవకాశం**

**జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు**

ఉమ్మడి జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోతున్నాయి. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాలో 16 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేటలో 18, నల్లగొండలో 17.2 డిగ్రీల చొప్పున రికార్డు అయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు యాదాద్రిలో 19.2, సూర్యాపేటలో 19.7, నల్లగొండలో 18.9 డిగ్రీల చొప్పున రికార్డయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతల కంటే పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు మంచు దట్టంగా కురుస్తున్నది. సాయంత్రం ఆరు గంటల తర్వాత ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతుడంటం, చలిగాలులు వీస్తుండటంతో జనం ఇండ్లకే పరిమితమవుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ)

### సీజనల్ వ్యాధులకు ఆస్కారం..

వాతావరణంలో వచ్చిన మార్పులతో గాలి, నీళ్లు, క్రిమికీటకాల ద్వారా రకరకాల వ్యాధులు వ్యాపిస్తాయి. చలికాలంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. కాలుష్యం, సూర్యరశ్మి తక్కువగా ఉండటం వల్ల గాలి ద్వారా, వర్షపు నీటి ద్వారా వచ్చే దోమల కారణంగా క్రిమికిటకాల నుంచి రోగాలు వ్యాపిస్తాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. పగలు అధికంగా, రాత్రి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వ్యాధులు సోకుతున్నాయి. దగ్గు, జలుబు, ఆస్తమా, చర్మ సంబంధ వ్యాధులు, న్యూమోనియా లాంటి జబ్బులు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఈ కాలంలో ఇన్‌ఫ్ల్యూయెంజా, ఫ్లూ వైరస్‌లు దాడి చేసే ప్రమాదముంది. ఈ వైరస్‌లతో జబ్బులు చుట్టుముడుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో తేమ శాతం తగ్గిపోవడంతో చర్మం రక్షణ శక్తి సన్నగిల్లుతుంది. వాతావరణ కాలుష్యం, బహిరంగ ధూమపానం వల్ల గొంతు సంబంధిత వ్యాధులు పెరుగుతాయని వైద్యులు చెబుతున్నారు.

### కమ్మేస్తున్న పొగమంచు

ఉపరితల ఆవర్తనం కారణంగా వారం రోజులుగా నిలకడగా ఉన్న గరిష్ఠ ఉష్ణోగ్రతలతోపాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం రెండ్రోజులుగా తగ్గుముఖం పట్టాయి. గురువారం తెల్లవారుజాము నుంచి తీవ్రత పెరిగింది. ఉదయం 10 గంటలైనా దట్టంగా ఏర్పడిన పొగ మంచు విడిపోవడం లేదు. పొద్దంతా చల్లటిగాలులు వీయడంతో వాతావరణంలో తేమ ప్రభావంతో ప్రజలు వణికిపోతున్నారు. సంక్రాంతి నాటింకి చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది.



నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్ వద్ద పిల్లలకు స్వెట్టర్లు కొంటున్న దృశ్యం

### జర భద్రం..

సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆస్తమా ఉన్న వారు నిత్యం వాడే మందులను అందుబాటులో ఉంచుకోవాలి. దుమ్ము, ధూళి పనులకు దూరంగా ఉండాలి. చల్లని గాలికి ఎక్కువగా తిరగొద్దు. ప్రయాణం చేస్తున్నప్పుడు నోరు, ముక్కు కవర్ అయ్యేలా మాస్కులు, స్వెటర్లు ధరించాలి. బైక్‌పై వెళ్లేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. హార్ట్ పేషెంట్లు, గుండె ఆపరేషన్ చేయించుకున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చలిలో ఎక్కువగా తిరగడం వల్ల రక్తనాళాలు సంకోచించి గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. జ్వరం, దగ్గు, జలుబు వస్తే ఇంట్లోనే ఉండాలి. బయట ఎక్కువగా తిరగవద్దు. ప్రతి రోజూ వ్యాయామం చేయాలి. నూలు వస్త్రాలు ధరించాలి. చిన్నపిల్లల చేతులు, కాళ్లకు గ్లౌజ్‌లు వేయాలి. కాళ్లు, చేతులు పగుళ్లు రాకుండా వ్యాజిలిన్ రాసుకోవాలి. ఉదయం 8 గంటల కంటే ముందు, సాయంత్రం 6 గంటల తర్వాత దూర ప్రయాణాలను రద్దు చేసుకుంటే మంచిది. బీపీ, షుగర్ ఉన్న వారు సైతం జాగ్రత్తలు పాటించాలి.



### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చలికాలంలో జలుబు, దగ్గు, జ్వరం వచ్చిన సమయంలో ఉపశమనం కోసం సొంత వైద్యం మానుకోవాలి.
- వైద్యులను సంప్రదించి వారి సూచనలు మేరకు మందులు వాడాలి.
- కాచి చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం మంచింది.
- చలికాలంలో చేతుల పరిశుభ్రత చాలా ముఖ్యం. చేతులు కడుకున్న తర్వాతే ఆహారాన్ని తీసుకోవాలి.
- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంట్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలి.
- శీతల పానియాలు, ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా వాటిని చిన్నారులకు ఇవ్వకూడదు.
- చిన్నారులకు స్వెటర్లు వేయకుండా ఆరుబయట తిరగనివ్వద్దు.
- గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారు జాగ్రత్తగా ఉండాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- వీలైనతం వరకు సూర్యుడు కాస్త వెలుగులోకి వచ్చిన తర్వాతే జాగింగ్ , వ్యాయాయం చేయాలి.
- తెల్లవారుజామున, రాత్రివేళల్లో వాహనాన్ని నడపకపోవడం మంచింది.



బైక్‌పై స్వెట్టర్లతో వెలుతున్న చిన్నారులు

### గోరు వెచ్చని నీళ్లు తాగాలి

వాతావరణంలో మార్పులు వచ్చాయి. చల్లని గాలులకు తిరగకూడదు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో జాగ్రత్తలు తప్పకుండా పాటించాలి. గొంతు నొప్పి, ఆస్తమా, ఫ్లూ లాంటి వ్యాధులు ప్రబలుతాయి. కొవిడ్ సమయంలో చేసినట్లు.. ఇంట్లో వేడి చేసి చల్లార్చిన నీటిని తాగితే మంచిది. వీలైనంత వరకు మాస్కులు వాడితే బెటర్. సాధారణంగా జలుబు, జ్వరాలకు అనవసరంగా యాంటిబయాటిక్స్ వాడకూడదు. ఇంట్లోనే చిట్కాలు పాటించిన తర్వాత.. తగ్గకుంటే ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి.



– డాక్టర్ అనిల్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, భువనగిరి



సూర్యాపేట మండలం బాలెంలలో ధాన్యం కొనుగోళ్లు

# తుది దశకు ధాన్యం కొనుగోళ్లు

**సూర్యాపేట జిల్లాలో 90 శాతం పూర్తి**

**ధాన్యం సేకరణ లక్ష్యం 2 లక్షల మెట్రిక్ టన్నులు..**

**ఇప్పటివరకు వచ్చింది 1.80 లక్షల మెట్రిక్ టన్నులు**

**70 శాతం మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు**

సూర్యాపేట జిల్లాలో వానకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లను అధికార యంత్రాంగం 90 శాతం పూర్తి చేసింది. ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం గత నెల రోజులుగా బిజీగా ఉన్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఆటంకం కలుగకుండా జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ చొరవ తీసుకున్నారు. జిల్లాలో వానకాలం సీజన్‌కు సంబంధించి సుమారు 4.50 లక్షల ఎకరాలు సాగు చేయగా 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుండగా బహిరంగ మార్కెట్‌లో ఈ సారి ధరలు అధికంగా ఉండడంతో రైతులు అటువైపు మొగ్గు చూపారు. జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 1.80 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. మరో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పొలాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉంది. ఇప్పటి వరకు రూ.400 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా 290 కోట్ల రూపాయలు రైతులు అక్కౌంట్లలో వేశారు. మరో 110 కోట్లకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

– సూర్యాపేట, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ)

సూర్యాపేట జిల్లాలో నాగార్జునసాగర్, కాళేశ్వరం, మూసీ నదుల పరిధిలోని సుమారు 5 లక్షల ఎకరాల ఆయకట్టులో రైతులు వరి ధాన్యం పండించారు. గత నెల రోజులుగా ధాన్యం దిగుబడి వస్తుండగా ఎన్నికల బిజీలో అధికార యంత్రాంగం బిజీగా ఉన్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లకు ఆటంకం కలుగకుండా జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ చర్యలు తీసుకున్నారు. ధాన్యం కొనుగోలు కోసం జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ చివరి వారంలో 274 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. ఇప్పటి వరకు 20 సెంటర్లలో పూర్తి కాగా వాటిని క్లోజ్ చేశారు. మరో 60 శాతం సెంటర్లలో 2 నుంచి 5 లారీల ధాన్యం ఉంది. ప్రభుత్వం రైతులకు చెల్లించే మద్దతు ధర క్వింటా ఒక్కంటికి రూ.2,203 ఉండగా.. ఈసారి బహిరంగ మార్కెట్‌లో ధర అధికంగా ఉండడంతో రైతులు అటువైపే మొగ్గు చూపారు. బహిరంగ మార్కెట్‌లో గ్రేడ్–1 రకం క్వింటాకు రూ.3,200 నుంచి 3,500 వరకు పలికింది. దాంతో రైతులు బహిరంగా మార్కెట్‌లోనే ఎక్కువగా విక్రయించారు.



### 1.80లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు

జిల్లాలో రైతులు పండించిన పంటను దాదాపు 90 శాతం మేర సివిల్ సప్లయ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 4.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, సుమారు 3.50 లక్షల మెట్రిక్ టన్నల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. అయితే బహిరంగ మార్కెట్‌లో ధరలు అధికంగా ఉండడంతో ఈసారి 2 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ మేరకు ఇప్పటికే 1.80 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. మరో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పొలాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉంది. ఇప్పటి వరకు రూ.400 కోట్ల రూపాయల ధాన్యం కొనుగోలు చేయగా, రూ.290 కోట్లను రైతులు అక్కౌంట్లలో వేశారు. మరో 110 కోట్లకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు సివిల్ సప్లయ్ శాఖ జిల్లా మేనేజర్ రాంపతినాయక్ తెలిపారు. మొత్తం మీద వారం నుంచి పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.